ఏపీ సీఎం జగన్‌ను కలిసిన జగదీశ్వర్‌గుప్తా



ఏపీ సీఎం జగన్‌తో జగదీశ్వర్‌గుప్తా

సిద్దిపేటఅర్బన్‌: ఏపీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు తడక జగదీశ్వ ర్‌గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్‌ సమ్మిట్‌లో ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. సీఎం తన యోగక్షేమాలపై ఆరా తీయడం సంతోషంగా ఉందని జగదీశ్వర్‌గుప్తా ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

వర్గల్‌ ఎంపీపీ సమావేశంలో గడా ఓఎస్డీ ముత్యంరెడ్డి



మాట్లాడుతున్న గడా ఓఎస్డీ ముత్యంరెడ్డి

వర్గల్‌(గజ్వేల్‌): అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాదరణ చూరగొనాలని, కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని గడా ఓఎస్డీ ముత్యంరెడ్డి సూచించారు. శనివారం ఎంపీపీ లతారమేశ్‌గౌడ్‌ అధ్యక్షతన జరిగిన వర్గల్‌ మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

- గోదావరి జలాల విడుదలతో వర్గల్‌ పెద్దచెరువు తదితర జలాశయాల్లో నీరు పూర్తిగా నిండిపోయి సాగుచేసిన పంటలు మునిగిపోయాయని, ఆ రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని సభ్యులు కోరారు.
- మండలంలో ఎంపీడీఓ, ఎంఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ తదితర పోస్టులు ఇన్‌చార్జిలకే పరిమితమయ్యాయని, పూర్తిస్థాయి అధికారులను నియమించాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు.
- మల్లారెడ్డిపల్లిలో రేషన్‌షాపు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సభ్యులు పేర్కొనగా, 350 కార్డులు ఉంటేనే కొత్త షాపునకు ప్రతిపాదించొచ్చని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తహసీల్దార్‌ సతీశ్‌కుమార్‌ వారికి తెలిపారు.
- గిర్మాపూర్‌, నాచారం, నెంటూరు హెల్త్‌ సబ్‌సెంటర్లకు నూతన భవనాల కోసం ఒక్కో భవనానికి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్‌ ఏఈ సిద్దిఖీ అన్నారు. స్థలం కేటాయిస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామని ప్రజాప్రతినిధులను కోరారు.
- మండలంలో ఒక అంగన్‌వాడీ టీచర్‌, 5 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ వాణి తెలిపారు.
- కంటివెలుగు కార్యక్రమం మండలంలో సజావుగా సాగుతుందని, శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని వైద్యాధికారిణి డాక్టర్‌ హరిత కోరారు.
- ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, గ్రామాలాభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ లత పేర్కొన్నారు.
- కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్‌, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ రామకృష్ణారెడ్డి, మండల రైతు కో–ఆర్డినేటర్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ స్వర్ణకుమారి, తహసీల్దార్‌ సతీశ్‌కుమార్‌, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సభలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్‌ చాలీసా యాగం

- ఏడాదిగా కొనసాగుతున్న పూజలు
- నేటి ముగింపు కార్యక్రమానికి ప్రముఖుల రాక



యాగం చేస్తున్న భక్తులు

దుబ్బాక: దౌల్తాబాద్‌ మండల పరిధిలోని మాచిన్‌పల్లి సీతారామాంజనేయస్వామి ఆలయంలో సంవత్సర కాలంగా భక్తిశ్రద్ధల మధ్య హనుమాన్‌ చాలీసా యాగం కొనసాగుతోంది. కరోనా అనంతరం పరిస్థితులను చూసి ప్రజల ఆయురారోగ్యాలు, హిందూ ధర్మ పరిరక్షణకు సీతారామ్‌ హనుమాన్‌ దేవస్థానం చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతి సహిత యాగంగా కూడా ఈ యాగం జిల్లాలో ఎంతో ప్రసిద్ధి పొందింది. యాగం సందర్భంగా 90 రోజుల పాటు హనుమాన్‌ దీక్షాదారులకు నిత్యాన్నదాన కార్యక్రమం సైతం నిర్వహించారు. గోవులకు నిత్య పూజలు చేస్తున్నారు. స్వల్ప కాలంలోనే ఎంతో ప్రఖ్యాతి పొందిన ఆలయానికి తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి భక్తులు రావడం విశేషం. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో వసతులు కల్పిస్తున్నారు. ఈ నెల 5వ తేదీన యాగం ముగుస్తుండడంతో జిల్లాలోని ప్రముఖ నాయకులు, పలు సంస్థల చైర్మన్‌లు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు.

క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి భూమిపూజ

మద్దూరు(హుస్నాబాద్‌): దూల్మిట్ట మండలంలోని లింగాపూర్‌ గ్రామంలో రూ.4లక్ష నిధులతో కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నారన్నారు. నిధులు మంజూరు చేసిన జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ ముక్క కనకయ్య, బీఆర్‌ఎస్‌ మండల యూత్‌ అధ్యక్షుడు బడుగు సాయిలు, బీఆర్‌ఎస్‌ నాయకులు తాళ్లపల్లి భిక్షపతిగౌడ్‌, నలగొప్పుల రాములు, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ కృష్ణయ్య పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికపై విచారణ



దరఖాస్తుదారులను విచారిస్తున్న తహసీల్దార్‌ సలీంమియా

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో డబుల్‌ బెడ్రూం ఇళ్ల దరఖాస్తుదారులను అధికారులు విస్తృత స్థాయిలో విచారిస్తున్నారు. దుబ్బాక పట్టణంలో గతంలో 587 మంది లబ్ధిదారులను అధికారులు లాటరీ ద్వారా ఎంపిక చేశారు. మిగిలిన డబుల్‌ బెడ్రూం ఇళ్లకు 941 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిని అధికారులు టీమ్‌లుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో విచారిస్తున్నారు.

దత్తక్షేత్రంలో ఉత్సవాలు ప్రారంభం

నంగునూరు(సిద్దిపేట): అజ్ఞానమనే చీకటిని పారదోలి జ్ఞాన జ్యోతిని వెలిగించి సన్మార్గంలో నడిపించే వాడే గురువని కల్పవృక్షచ్ఛాయా శ్రీపాద శ్రీవల్లభ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ శ్రీపాదశర్మ భక్తులకు ఉపదేశించారు. రాంపూర్‌లోని దత్తక్షేత్రంలో ఏడురోజుల పాటు నిర్వహించనున్న గురు చరిత్ర సప్తహ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. మొదటి రోజు పుణ్యాహవాచనం, కృష్ణుడి విశేష అర్చన, గురు చరిత్రలోని తొమ్మిది పారాయణాలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు యోగేష్‌ దేశ్‌పాండే గిరీష్‌ జోషి ఆధ్వర్యంలో కాశీ విశ్వేరుడికి ప్రదోష పూజ, అభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదశర్మ మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం దత్తక్షేత్రంలో వారంరోజుల పాటు గురు పారాయణం నిర్వహిస్తున్నామన్నారు.

ఫంక్షన్‌హాల్‌గా రైతువేదిక



రైతువేదికలో ఫంక్షన్‌ చేస్తున్న దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్‌): అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామంలో నిర్మించిన రైతువేదిక ఫంక్షన్‌ హాల్‌గా మారడంపై భారతీయ కిసాన్‌ సంఘ్‌ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సమావేశాల కోసం నిర్మించిన రైతువేదిక ఫంక్షన్‌లకు హాల్‌గా మారడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో రైతువేదిక ఫంక్షన్‌ హాల్‌గా మారిందని వెంటనే జిల్లా ఉన్నతాధికారులు సంబంధిత అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌ చేస్తున్నారు.

మైనార్టీల ఆర్థికాభివృద్ధికి చర్యలు

దుబ్బాక: మైనార్టీలు ఆర్థికంగా ఎదగడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్‌ ద్వారా వ్యక్తిగత రుణాలను మంజూరు చేస్తుందని రాయపోల్‌ ఎంపీడీఓ మున్నయ్య అన్నారు. మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారిని శనివారం రాయపోల్‌ మండల ప్రజాపరిషత్‌ కార్యాలయంలో రాయపోల్‌ సెంట్రల్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా ఫీల్డ్‌ ఆఫీసర్‌ ఆర్య నాయర్‌తో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా పరిధి గ్రామాల్లో 1 యూనిట్‌కు 45 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది, తదితరులున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులను పంపిణీ చేస్తున్న దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్‌): పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని డీసీసీబీ చైర్మన్‌ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలోని రైతువేదిక భవనంలో 33 మంది లబ్ధిదారులకు ఎంపీపీ ర్యాగల్ల సుగుణతో కలిసి శనివారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్‌, మండల, సర్పంచ్‌, ఎంపీటీసీల ఫోరంలా అధ్యక్షులు చిట్టి మాధురీ రెడ్డి, చింతల సాయిబాబ, మండల అధ్యక్షుడు నూనె కుమార్‌, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్‌ ర్యాగల్ల దుర్గయ్య, ఎంపీడీఓ రాంరెడ్డి, తహసీల్దార్‌ రామేశ్వర్‌, స్థానిక ఎంపీటీసీలు అనసూయ, ఆరుట్ల లక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌

మద్దూరు(హుస్నాబాద్‌): గ్రామ పంచాయతీకి కేటాయించిన మొక్కలను పెంచి ప్రజలకు అందించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. శనివారం దూల్మిట్ట మండలంలోని కూటిగల్‌ గ్రామంలో నర్సరీ, డంప్‌యార్డ్‌, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత పెరుగుతున్నందున మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ బాలమణిబాలకృష్ణ, ఉపసర్పంచ్‌ చెప్యాల రేణుకరవి, పంచాయతీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

కొండపాక(గజ్వేల్‌): కుకునూరుపల్లి మండలం మేదినీపూర్‌ గ్రామ శివారులోని 33/11 కేవీ విద్యుత్‌ సరఫరా ఫీడర్‌ మరమ్మతుల్లో భాగంగా వెలికట్ట, తిమ్మారెడ్డిపల్లి, మేదినీపూర్‌, తిప్పారం గ్రామాల్లోని సబ్‌స్టేషన్‌ పరిధిలో గల వెలికట్ట, తిమ్మారెడ్డిపల్లి, లకుడారం, కుకునూరుపల్లి, మేదినీపూర్‌, మంగోల్‌, ముద్దాపూర్‌, బొబ్బాయిపల్లి, రామునిపల్లి, తిప్పారం, మాత్‌పల్లి, కోనాయిపల్లి గ్రామాల్లోని గృహాలకు, వ్యవసాయ బావులకు, ఇండస్ట్రియల్‌లకు 11కేవీ ఫీడర్లకు ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తుక్కాపూర్‌ సబ్‌స్టేషన్‌ ఏడీఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిలిండర్‌ ధర తగ్గించాలి

చేర్యాల(సిద్దిపేట): పెంచిన సిలిండర్‌ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజులు డిమాండ్‌ చేశారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్‌ సమీపంలో గ్యాస్‌ ధరల పెంపును నిరసిస్తూ ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌,శ్రీనివాస్‌, రమేశ్‌, కుమార్‌, కనకయ్య, శ్రీహరి, శోభ, భాస్కర్‌, రాంచంద్రం, మల్లేశం, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహిత మహిళల అరెస్ట్‌ అప్రజాస్వామికం



హుస్నాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు

హుస్నాబాద్‌: గౌరవెల్లి రిజర్వాయర్‌ ముంపు బాధితులైన గూడాటిపల్లి వివాహిత మహిళా నిర్వాసితులను పోలీస్‌లు అరెస్ట్‌ చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో శనివారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి మాట్లాడుతూ.. వివాహిత మహిళా నిర్వాసితులకు అర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ ఇవ్వాలని 75 రోజులుగా శాంతియుతంగా దీక్షలు చేస్తుంటే పట్టించుకోని పోలీస్‌లు వివాహిత మహిళలను అరెస్ట్‌ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. మహిళలకు ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ కింద వచ్చే డబ్బులు ఇస్తే మాకేమి అభ్యంతరం లేదన్నారు. ఇప్పటికైనా మహిళలకు ప్యాకేజీ డబ్బులు ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్‌ చేశాడు. నిరసన వద్దకు వచ్చిన పోలీస్‌లు కాంగ్రెస్‌ నాయకులను అరెస్ట్‌ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ హుస్నాబాద్‌, అక్కన్నపేట మండలాల అధ్యక్షులు చందు, అయిలయ్య, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బోనగిరి రజిత, కౌన్సిలర్లు రాజు, లావణ్యసది, నాయకులు ఎండీ హస్సేన్‌, రాంబాబు నాయక్‌, భాస్కర్‌ నాయక్‌, మ్యాక రమేశ్‌, రమేశ్‌, బాలయ్య, శ్రీనివాస్‌గౌడ్‌, అయిలయ్య, కుమార్‌, విద్యాసాగర్‌, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



హుస్నాబాద్‌రూరల్‌: అవగాహన కల్పిస్తున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్‌రూరల్‌: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హుస్నాబాద్‌ జూనియర్‌ మున్సిఫ్‌ కోర్టు సివిల్‌ జడ్జి శివరంజని అన్నారు. శనివారం మహిళా దినోత్సవం పురస్కరించుకొని పోతారం(ఎస్‌) గ్రామంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి శివరంజని మహిళా చట్టాలు, మహిళల భద్రతపై చట్టాలను వివరించారు. మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని స్వయం ఉపాధి పొందుతున్న తీరును అభినందించారు. స్త్రీ స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు చిత్తారి రవీందర్‌, సాయిని మల్లేశం, సర్పంచ్‌ బత్తిని సాయిలు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం మహిళలకు ఎంపీపీ తలారి కీర్తన అధ్యక్షతన మహిళా చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్‌ రఘురాం మట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అధికమించాలని, అందుకు మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళల హక్కులను బాధ్యతలను తెలుసుకొని మహిళా సాధికారత సాధించాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్‌ లీగల్‌ సర్వీస్‌ అథారిటీ డిస్ట్రిక్‌ లీగల్‌ సర్వీస్‌ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి, ఎంపీడీవో అనురాధ, సర్పంచ్‌ లత తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



హుస్నాబాద్‌: జెండా ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్‌: పట్టణంలోని ఆరెపల్లెలో శనివారం భారతీయ కిసాన్‌ సంఘ్‌ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రైతుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్‌ సంఘ్‌ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 1972లో భారతీయ కిసాన్‌ సంఘ్‌ ఏర్పాటు చేశారన్నారు. నాటి నుంచి నేటివరకు రైతుల సమస్యల పరిష్కారం కోసం కిసాన్‌ సంఘ్‌ పని చేస్తుందన్నారు. రాబోయే కాలంలో రైతుల అవసరాలు, హక్కుల కోసం పోరాటం చేస్తామన్నాడు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ వేణుయాదవ్‌, రైతులు గాంధీ, బయ్యన్న, రాజయ్య, శ్రీనివాస్‌యాదవ్‌, వీర్ల లింగయ్య, కాశబోయిన వెంకటయ్య తదితరులు ఉన్నారు.

కొండపాక(గజ్వేల్‌): మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి, వెలికట్ట క్రాస్‌ రోడ్డు వద్ద భారతీయ కిసాన్‌ సంఘ్‌ నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ ప్రముఖ్‌ గూడ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 11 వేల గ్రామాల్లో 301 జిల్లాల్లో భారతీయ కిసాన్‌ సంఘ్‌ విస్తరించిందన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్‌ సంఘ్‌ నాయకులు సుంకరి పరశురాంలు, భిక్షపతి, నవీన్‌, నితిన్‌, స్వామి, హమాలీ సంఘం నాయకులు చంద్రయ్య, ఐలయ్య, శ్రీనివాసరావు, రమేశ్‌, మోతయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

‘వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమే’



రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న చింతల రాజీవీర్‌

సిద్దిపేటరూరల్‌: హాథ్‌ సే హాథ్‌ జోడో కార్యక్రమంతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌ పార్టీకి ప్రజాదరణ పెరుగుతుందని ఎన్నికల్లో వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనని యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజీవీర్‌ అన్నారు. పాదయాత్ర చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సిద్దిపేట జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి చింతల రాజీవీర్‌, జక్కాపూర్‌ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌ నాయకులు శనివారం కలిశారు. హాథ్‌ సే హాథ్‌ జోడో కార్యక్రమం సిద్దిపేట నియోజకవర్గంలో చేపడితే స్థానిక కాంగ్రెస్‌ నాయకుల్లో జోష్‌తో పాటు పార్టీలో సంస్థాగత మార్పులు వస్తాయని వారికి వివరించామన్నారు. అదే విధంగా జక్కాపూర్‌ గ్రామంలో ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, మాజీ మంత్రి అనంతుల మదన్‌మోహన్‌ల విగ్రహాల ఆవిష్కరణలకు ఆహ్వానించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌ గాలి జోరుగా వీస్తుందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నారాయణరావుపేట మండల కార్య నిర్వాహక అధ్యక్షుడు రాగుల అశోక్‌, సీనియర్‌ నాయకులు పల్లె శ్రీనివాస్‌, బీసీ సెల్‌ నాయకులు తీగల భాస్కర్‌, నాయకులు పరశురాములు, గ్రామ అధ్యక్షుడు జక్కుల కనకయ్య, పల్లె అంజయ్య, తీగల నరేశ్‌, అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు



రైతులకు డైరీలు అందజేస్తున్న కృష్ణారెడ్డి

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్‌ సాగు చేసే రైతులు సరైన మెళకువలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు గడించవచ్చని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు బద్దిపడగ కృష్ణారెడ్డి అన్నారు. అక్కేనపల్లిలో శనివారం ఆయిల్‌పామ్‌ సాగు చేస్తున్న రైతులకు సాగు, యాజమాన్య పద్ధతులు, మెళకువలు, మార్కెటింగ్‌ అంశాలకు సంబంధించిన డైరీలు అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో 55 మంది రైతులు 180 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ సాగు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రభుత్వం డ్రిప్పు అందజేయడంతో పాటు సబ్సిడీపై విత్తనాలు, సంరక్షణ కోసం నిధులు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ దిలీప్‌నాయక్‌, సర్పంచ్‌ వెంకటేశం, ఆర్‌ఐ లింగం, నితీశ్‌కుమార్‌, రాజేశ్వర్‌, యాదగిరి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్‌ స్వరూపారాణి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 5వ వార్డు బీడీ కాలనీలో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ అంకుగారి స్వరూపరాణి స్థానిక కౌన్సిలర్‌ ఆడెపు నరేందర్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్‌ రాజేంద్రకుమార్‌, కౌన్సిలర్లు జుబేదాఖతూన్‌, సురేష్‌, కో–ఆప్షన్‌ సభ్యుడు నాగేశ్వర్‌రావు, మార్కెట్‌ వైస్‌చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు బాల్‌నర్సయ్య, నాయకులు సిద్ధిలింగం, రాజేశం, యాదగిరి, పరశురాములు, భిక్షపతి, షబాజ్‌, రాజు, సతీశ్‌, మున్సిపల్‌ మేనేజర్‌ ప్రభాకర్‌ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



గంభీర్‌పూర్‌ పాఠశాలలో..



సిద్దిపేటరూరల్‌: జక్కాపూర్‌ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అత్యుత్తమ విద్యాబోధన చేసిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం షబీనా అత్తార్‌, ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు.

సిద్దిపేటరూరల్‌: నారాయణరావుపేట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, జక్కాపూర్‌ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయులై ఉత్సాహంగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

గంభీర్‌పూర్‌లో..

దుబ్బాకరూరల్‌: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయ పాత్రలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్‌): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్‌, ప్రాథమిక పాఠశాలలో, కొండపాక మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలోని హైస్కూల్లో శనివారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తున్న తీరులను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం బాలకిషన్‌, శ్రీనివాస్‌రెడ్డిలు పర్యవేక్షించారు.



మిరుదొడ్డి(దుబ్బాక): ఖాజీపూర్‌లో..



కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో..

సంక్షిప్త వార్తలు

◆ వసతి గృహంలో సిబ్బంది నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో సిబ్బంది నియామకం చేపడుతున్నట్లు ఎంఈఓ దేశిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం పద్మలతలు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆసక్తి గలవారు తమ పూర్తి వివరాలతో ఈ నెల 6వ తేదీ వరకు చిన్నకోడూరు ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బాలికల వసతి గృహంలో కేర్‌ టేకర్‌ పోస్టుకు(డిగ్రీ) ఉండాలని, ఏఎన్‌ఎం మహిళా పోస్టుకు (నర్సింగ్‌లో డిప్లొమా), ప్రధాన వంట మనిషి మహిళా పోస్టుకు (పదో తరగతి, ఐదేళ్ల అనుభవం), సహాయ వంట మనిషి 2 మహిళా పోస్టులకు(పదో తరగతి), కాపలాదారుకు మహిళా లేదా 50 ఏళ్ల దాటిన పురుషుడు, మహిళా స్వీపర్‌ నియామకం చేపడుతున్నట్లు చెప్పారు.

◆ ఆర్థికసాయం

దుబ్బాక: దౌల్తాబాద్‌ మండలం లింగాయపల్లి తండాలో ప్రమాదవశాత్తు సిలిండర్‌ పేలి గుడిసెలు దగ్ధం కావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు శనివారం నాడు బాధితులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మండల పరిధిలోని గొడుగుపల్లి గ్రామానికి చెందిన శేఖర్‌ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో అతడిని పరామర్శించారు.

◆ పాఠశాలకు కంప్యూటర్‌ వితరణ

మద్దూరు(హుస్నాబాద్‌): మండలంలోని లద్నూరు గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలకు 1985–86 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలకు కంప్యూటర్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్‌ పాకాల జయఇసాక్‌, తదితరులు పాల్గొన్నారు.

◆ సమస్యలపై పోరు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో నెలకొన్న సమస్యలతో పాటు ఇంటి పన్ను పెంపు తదితర వాటిపై టీడీపీ ఒంటరిగా పోరు చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఒగ్గు రాజు అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని పెద్దమ్మగడ్డ ప్రాంతంలో ఎడమల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజు మాట్లాడుతూ.. అంచలంచెలుగా ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ రూపొందించి, ఒక్కొక్కటిగా క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడతామన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు బాల్‌నర్సయ్య, టౌన్‌ ఉపాధ్యక్షుడు ఎక్బాల్‌, నాయకులు శివలింగం, శ్రీనివాస్‌, గణేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ నిందితులను శిక్షించాలి

హుస్నాబాద్‌: ఉమ్మడి రాష్ట్రంలో రెండుసార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టి, పేదలకు సంక్షేమ పథకాలు అందించిన దివంగత వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేసిన వారిని శిక్షించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్‌ చేశాడు. శనివారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజల గుండెల్లో నిలిచిన రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని కూల్చడం సిగ్గుచేటన్నారు. విగ్రహాన్ని కూల్చిన వారిని వెంటనే అరెస్ట్‌ చేయాలని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్‌ చేశాడు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డి అశోక్‌, జిల్లా యూత్‌ ప్రధాన కార్యదర్శి గట్టు సాయి, నాయకులు ఉన్నారు.

◆ పదిలో అగ్రస్థానంలో నిలబెడదాం

వర్గల్‌(గజ్వేల్‌): పదో తరగతిలో చక్కని ఫలితాల సాధన ద్వారా వర్గల్‌ను జిల్లాలోనే అగ్రస్థానంలో నిలబెడదామని జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్‌ అన్నారు. శనివారం వర్గల్‌ జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడ్‌ అధ్యక్షతన నిర్వహించిన పేరెంట్స్‌, స్టూడెంట్స్‌ సమావేశంలో ఆయనతో పాటు ఎంపీపీ లతరమేశ్‌గౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. 10 జీపీఏ సాధించిన విద్యార్థికి మంత్రి హరీశ్‌రావు రూ.10వేల నగదు బహుమతి ఇస్తామని, మండలం నుంచి సైతం మరో రూ.10వేలు ఇస్తామని ప్రకటించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడ్‌ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు విద్యార్థుల పురోగతికి సహకారం అందించాలన్నారు.

◆ ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

గజ్వేల్‌రూరల్‌: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఏఎంసీ చైర్మన్‌ మాదాసు శ్రీనివాస్‌ అన్నారు. మండలంలోని అహ్మదీపూర్‌కు చెందిన టప్ప రాములు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును బాధితుడి కుటుంబ సభ్యులకు శనివారం ఆయన అందజేశారు.

◆ ఘనంగా మహిళా దినోత్సవం

సిద్దిపేటరూరల్‌: ఐసీడీఎస్‌ సిద్దిపేట కార్యాలయంలో సీడీపీఓ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా మహిళా దినోత్సవ సంబరాలను నిర్వహించారు. సిద్దిపేట ప్రాజెక్టు పరిధిలోని 11 సెక్టార్‌లలో గల అంగన్‌వాడీ టీచర్లతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రమాదేవి మాట్లాడుతూ.. టీచర్లు ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వారధిగా అంగన్‌వాడీలు ముఖ్యపాత్ర వహిస్తున్నారన్నారు. 11 మంది అంగన్‌వాడీలను, ముగ్గురు ఆయాలను సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

◆ షెటర్ల పరిశీలన

కోహెడ(హుస్నాబాద్‌): మండల కేంద్రంలో కేడీసీసీబీ బ్యాంక్‌ నూతన శాఖ ఏర్పాటుకు కరీంనగర్‌ జిల్లా సీఈఓ ఎస్‌.సత్యనారాయణరావు గ్రామ పంచాయతీ షాపింగ్‌ కాంప్లెక్స్‌ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోహెడలో 68వ నూతన శాఖ ఏర్పాటుకు నాప్కాబ్‌ అధ్యక్షుడు రవీందర్‌రావు ఆదేశించినట్లు చెప్పారు. జీపీ కాంప్లెక్స్‌ గదుల్లో బ్యాంక్‌ ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బంది లేదని, షెటర్లు అనువుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కోహెడ ప్యాక్స్‌ చైర్మన్‌ దేవేందర్‌రావు, కోహెడ ప్యాక్స్‌ సీఈఓ ముంజ మల్లికార్జున్‌, జాన్‌, రమేశ్‌ పాల్గొన్నారు.